సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

రైటర్‌కు ఏఎస్‌ఐగా పదోన్నతి



ఎం.వి.రమణ, ఏఎస్‌ఐ

గాజువాక: గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా సేవలందించిన హెడ్ కానిస్టేబుల్ మళ్ల వెంకట రమణకు ఏఎస్‌ఐగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన ఆయనకు ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ విభాగంలో నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రమణ ఉన్నతాధికారుల నుంచి అనేక అవార్డులు, రివార్డులు పొందారు. ఏఎస్‌ఐగా పదోన్నతి పొందిన ఆయన్ను సహచర సిబ్బంది అభినందించారు.

కల నెరవేరిన వేళ..



కానిస్టేబుల్ సరిపల్లి శ్రీనివాస్

గాజువాక: పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఉపాధ్యాయుడు కావాలనే కలను నెరవేర్చుకున్నాడు. గణితం సబ్జెక్టులో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించి పలువురి ప్రశంసలు అందుకున్నాడు గాజువాక ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్న కానిస్టేబుల్ సరిపల్లి శ్రీనివాస్.అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు గ్రామానికి చెందిన శ్రీనివాస్ 84 మార్కులు సాధించి ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడో స్థానంలో నిలిచారు. 2016లో జరిగిన కానిస్టేబుల్ సెలక్షన్స్‌లో పోలీస్ ఉద్యోగం సాధించారు. అయినా ఉపాధ్యాయుడిగా పని చేయాలనే లక్ష్యం వీడలేదు. దీంతో 2019లోడీఎస్సీ రాసినప్పటికీ ఫలితం దక్కలేదు. దీంతో ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేయాలనే కోరిక మరింత బలపడింది. ఒకపక్క కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూనే మరోపక్క డీఎస్సీకి పట్టువదలకుండా చదివారు. ఇటీవల వెలువడి డీఎస్సీలో ఫలితాల్లో శ్రీనివాస్ ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు సహా సహచర సిబ్బంది అభినందించారు.

రామాలయ నిర్మాణానికి విరాళం



ప్రతినిధులకు విరాళం అందిస్తున్న దాతలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక నిర్వాసితకాలనీలో రామాలయ పునర్నిర్మాణానికి గ్రామానికి చెందిన అమరపిని అప్పారావు కుమారులు రూ.56,565 విరాళం అందించారు. కార్యక్రమంలో నాయకులు విందుల నారాయణరావు, సతీష్, కరణం సన్ని, అమరపిని గోవింద్, మాడుగుల అప్పలరాజు, నరసింహనాయుడు, రమేష్, శంకర్, బుజ్జి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1 నుంచి కళాక్షేత్రాలకు ఆన్‌లైన్ బుకింగ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని బీఆర్ అంబేడ్కర్ కళాక్షేత్రం (సీడబ్ల్యూసీ–1), ఆంధ్రకేసరి కళాక్షేత్రం (సీడబ్ల్యూసీ–2)ల బుకింగ్ సెప్టెంబర్ 1 నుంచి ఆన్‌లైన్‌లో కేటాయించనున్నారు. ఇప్పటి వరకు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యుల శుభకార్యాల కోసం ఆయా కళాక్షేత్రాల కమిటీల ద్వారా ఆఫ్‌లైన్‌లో బుకింగ్ చేసుకునేవారు. యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభిస్తున్నారు. ఉద్యోగులు వైజాగ్ స్టీల్ డాట్ కామ్ ద్వారా బుక్ చేసుకుంటే వారికి సమాచారం ఈ–మెయిల్ ద్వారా అందజేస్తారు. పేమెంట్ గేట్‌వే సిద్ధం చేసే వరకు ప్రస్తుతం ఉన్న చలానా పద్ధతి కొనసాగిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బ్రహ్మకుమారీల రక్తదానం



రక్తదానం చేస్తున్న బ్రహ్మకుమారీ సంస్థ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సమాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్రహ్మకుమారీ అపరంజి పర్యవేక్షణలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సహకారంతో మురళీనగర్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. భారతదేశంతోపాటు నేపాల్‌లో 6 వేల సేవా కేంద్రాల్లో లక్ష యూనిట్ల రక్తం సేకరణలో భాగంగా రక్తదానం చేసినట్లు అపరంజి తెలిపారు. రక్తదానంలో బ్రహ్మకుమారీలతోపాటు మురళీనగర్ వాసులు పాల్గొన్నారు.



విగ్రహాలకు తుది మెరుగులు అద్దుతున్న కళాకారులు



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వినాయక విగ్రహాలు

అంతటా చవితి సందడి

గాజువాక: వరసిద్ధి వినాయకుడికి తొలిపూజ చేసేందుకు గాజువాక ముస్తాబవుతోంది. ఎక్కడికక్కడ చవితి పందిళ్లు వెలుస్తున్నాయి. యువకులు ఉత్సవ ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. పాతగాజువాక, కొత్తగాజువాక, కణితి రోడ్ ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద వినాయకుడి విగ్రహాలు, పూజా సామగ్రి విక్రయిస్తున్నారు. కొంతమంది ప్రతిమలను ఆర్డర్లపై తయారు చేయించుకోగా, మరికొంతమంది రెడీమేడ్ ప్రతిమలను కొనుగోలు చేసి మండపాలకు తరలిస్తున్నారు. కొనుగోలుదారులతో గాజువాక మెయిన్‌రోడ్డు, కణితి రోడ్డు కళకళలాడుతోంది. ఇక్కడ విగ్రహాలను తయారు చేయడానికి పశ్చిమ బెంగాల్‌లోని వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు ఆరేడు నెలల కిందటే వచ్చారు. ఇప్పటికే వివిధ రూపాల్లో విగ్రహాలను తయారు చేసి అందుబాటులో ఉంచారు. చిన్న చిన్న బొమ్మల నుంచి పది అడుగుల ఎత్తైన విగ్రహాలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఈసారి వినాయక విగ్రహాల ధరలు విపరీతంగా పెరిగాయని ఉత్సవ నిర్వాహకులు పేర్కొంటున్నారు. గతేడాదితో పోల్చితే ఐదుడుగుల విగ్రహానికి ఈ ఏడాది అదనంగా రూ.3 వేల వరకు ధర పెరిగిందని చెబుతున్నారు. ముడిసరుకు ధరలు పెరగడంతో విగ్రహాలకు కూడా ధర పెంచాల్సి వస్తోందని తయారీదారులు పేర్కొంటున్నారు. వినాయక చవితి ఉత్సవాల ప్రారంభానికి మరో రెండు రోజుల సమయం ఉన్నప్పటికీ నిర్వాహకులు ముందు నుంచే విగ్రహాలను తమ మండపాలకు తరలిస్తున్నారు. పర్యావరణానికి ఇబ్బంది లేకుండా అధికశాతం మట్టితో తయారు చేసిన విగ్రహాలనే ఉపయోగిస్తున్నారు. మరోవైపు వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ ప్రారంభించాయి.

జోరందుకున్న విక్రయాలు



కూర్మన్నపాలెం ప్రధానరహదారిపై అమ్మకానికి పెట్టిన వినాయక విగ్రహాలు

కూర్మన్నపాలెం: గణపతి పూజ సమీపిస్తుండడంతో రహదారులు, షాపింగ్ కాంప్లెక్సుల ముందు, ఇతర వ్యాపార సంస్థల వద్ద వినాయక విగ్రహాలను పేర్చి అమ్మకానికి పెట్టారు. కూర్మన్నపాలెం ,దువ్వాడ ప్రధాన రహదారి, వడ్లపూడి మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆదివారం ఎక్కడ చూసినా బొమ్మల దుకాణాలే దర్శనమిచ్చాయి. సెలవు దినం కావడంతో ప్రజలు కూడా పూజకు కావాల్సిన సామగ్రితో పాటు విగ్రహాలు కొనుగోలు చేశారు.ఏడాదిలో మొదటి పూజ కావడంతో ప్రతి ఒక్కరు తమ ఇళ్లల్లో పూజ చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. దీంతో కూర్మన్నపాలెం తదితర ప్రాంతాల్లో బొమ్మల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

మట్టి గణపతినే పూజిద్దాం



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న తిప్పల నాగిరెడ్డి, తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: పర్యావరణ హితమైన మట్టి గణపతినే పూజిద్దామని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి కోరారు. పెదగంట్యాడ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక ఉత్సవాల్లో మట్టితో తయారు చేసిన ప్రతిమలను ఉపయోగించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని..ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల తాగునీరు కలుషితమవుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, వార్డు అధ్యక్షులు ధర్మాల శ్రీనివాసరావు, మంత్రి శంకరనారాయణ, సంగ్రాన నూకరాజు, గొందేశి శ్రీనివాసరెడ్డి, పూర్ణ నందశర్మ, నాయకులు రాజాన వెంకటరావు,గౌస్, జీలకర్ర నాగేంద్ర, బొడ్డ గోవింద్, చిత్రాడ వెంకట రమణ, రోజారాణి, డీవీ రమణ, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక ప్రతిమలు, వ్రత పుస్తకాల పంపిణీ



మంగళపాలెం టిడ్కో కాలనీ వద్ద వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెం సమీపంలోని టిడ్కో కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీల్లో ఆదివారం సీపీఐ నాయకులు మట్టి వినాయక ప్రతిమలు, వ్రత కల్ప పుస్తకాలు అందించారు. సీపీఐ జిల్లా సమితి ప్రతినిధి జి.ఆనంద్, టిడ్కో గృహ లబ్ధిదారుల సంఘ ప్రతినిధులు రొక్కం శ్రీనివాసరావు, పి.అప్పలరాజు, ఎస్.భాస్కరరావు, కె.రమణి, వి.వాణి, ఆర్.రాహుల్ పాల్గొన్నారు.

ఘనంగా వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ జిల్లా మహాసభ



మాట్లాడుతున్న వ్యవస్థాపకురాలు రమాప్రభ

డాబాగార్డెన్స్: వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ 4వ జిల్లా మహాసభ ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఘనంగా నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.రమాప్రభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాలల్లో విజ్ఞానం, వినోదం, వికాసం పెంపొందించే లక్ష్యంతో గత 15 ఏళ్లుగా విశాఖ జిల్లాలో పని చేస్తున్నట్లు తెలిపారు. మహాసభలో క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.హరిత గత 3 ఏళ్లలో ప్రగతి ప్రణాళిక వివరించిన అనంతరం జోన్ల వారీగా చర్చలు జరిగాయి. బాలల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత పెంచడం, సమాజంలో వారి పాత్ర తెలియజేయడం, పిల్లల మధ్య స్నేహ భావాన్ని పెంపొందించడం వంటి అంశాలు వివరించారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించారు. నూతన జిల్లా నాయకత్వం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ వేలీ ప్రెసిడెంట్ పిల్లలమర్రి రఘు, రోటరీ క్లబ్ డైమండ్ నుంచి ప్రెసిడెంట్ కామేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ నీరజ, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు దీప, సునీత, ఆసరా చారిటబుల్ సొసైటీ సభ్యులు సంజీవకుమార్, శ్రీనాథ్, ఐద్వా సెక్రటరీ సత్యవతి, ప్రజా నాట్య మండలి కార్యదర్శి చంటి, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఎల్‌జీ నాయుడు, ఉమామహేశ్వరరావు, వీసీసీ సభ్యులు అలేఖ్య, నిఖిల్, శశి, జోన్ కన్వీనర్లు అప్పారావు, లీలావతి, సంధ్య, సరోజిని, అరుణ, శ్రావణి, భవానీ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలో నాటిన మొక్కలు

అగనంపూడి: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్.. మరికొన్ని సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ రైల్వేస్టేషన్ కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా రెండు వారాల కిందట నాటిన మొక్కల చుట్టూ పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. ఒకటో ప్లాట్‌ఫారంపై వీఐపీ లాన్‌లో మొక్కలు నాటిన సంఘాలు వాటి సంరక్షణ బాధ్యత చేపట్టాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలన్నారు.

విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలూ అవసరమే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: భారత నాట్య కళాంజలి డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ 11వ వార్షికోత్సవం ఆదివారం సిరిపురం జంక్షన్‌లో ఉన్న గురజాడ కళాక్షేత్రంలో వేడుకగా నిర్వహించారు. మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఛాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ పెద వీరరాజుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హరి వెంకటకుమారి మాట్లాడుతూ విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ప్రతి ఏటా ఇనిస్టిట్యూట్ గురువులు సంతోషి, విజయ్ వార్షికోత్సవం నిర్వహిస్తూ విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ హరిరామమూర్తి, రుక్మిణీదేవి ఫైన్ ఆర్ట్స్ కాలేజీ సీనియర్ ప్రొఫెసర్ వసుంధర థామస్ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

తాటిచెట్లపాలెం: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఫోర్త్ టౌన్ సీఐ ఉమాకాంత్ సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు ఎటువంటి గొడవల్లో తలదూర్చకూడదని, మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. హద్దులు మీరితే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.

ఐద్వా మహాసభల విజయవంతానికి పిలుపు

పరవాడ: అక్టోబరు 13, 14, 15 తేదీల్లో జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో మహాసభల పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నారులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఐద్వా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మన్యాల బంగారమ్మ, తుంపాల అన్నపూర్ణ, దేవి, సాయి, మంగమ్మ, లక్ష్మమ్మ, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న దాత వెంకటనాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం ఆటోనగర్‌కి చెందిన జి.వెంకటనాయుడు దంపతులు రూ. 2 లక్షల 8 వేల విరాళం చెక్కుని పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకి అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.

పోలీసుల సైకిల్ ర్యాలీ



విశాలాక్షినగర్‌లో ర్యాలీగా బయలుదేరిన ఏఆర్ పోలీసులు

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానం నుంచి అనకాపల్లి జిల్లా పోలీసులు ఆదివారం ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా సైకిల్ ర్యాలీ చేపట్టారు. కైలాసగిరి కూడలి నుంచి బయలుదేరి జోడుగుళ్లపాలెం నుంచి బీచ్ రోడ్డులో సీతకొండ మీదుగా సాగర్‌నగర్ వరకు ఉత్సాహంగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కీలకమన్నారు. ఆరోగ్యం దేశాన్ని బలోపేతం చేసి శక్తని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, మన్మధరావు, రమణమూర్తి, సంజీవిరావు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే

- డీజే సౌండ్‌లు పూర్తిగా నిషేధం
- ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు
- ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు చేసుకోవాలి
- ఉత్సవాల నిర్వాహకులతో సౌత్ ఏసీపీ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సౌత్ ఏసీపీ శ్రీనివాసరావు

గాజువాక: వినాయక ఉత్సవాలను ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సౌత్ ఏసీపీ వై.శ్రీనివాసరావు సూచించారు. సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని వినాయక ఉత్సవ నిర్వాహకులతో ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాహకులు తప్పనిసరిగా అన్ని రకాల అనుమతులను పొందాలన్నారు. అగ్నిప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. డీజే సౌండ్‌లు పూర్తిగా నిషిద్ధమన్నారు. ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు చిన్నపాటి సౌండ్‌సిస్టమ్‌ను వాడుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండపాలవద్ద, అనుపు కార్యక్రమాల్లో మందుగుండు సామగ్రి వాడరాదని సూచించారు. 11 రోజులపాటు ఉత్సవాల నిర్వహణకు అనుమతిస్తామన్నారు. భక్తుల నుంచి టికెట్ రూపంలో ఎటువంటి నగదు వసూలు చేయరాదన్నారు. రోడ్లపై పందిళ్లు వేసి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. సమావేశంలో సీఐలు పార్థసారధి, మల్లేశ్వరరావు, కేశవరావు, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

మెటల్ ఫెడరేషన్ సమావేశాలకు ఇంటక్ బృందం



ఫెడరేషన్ సమావేశాలకు బయలు దేరిన ఐఎన్‌టీయూసీ బృందం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ(ఇంటక్) నాయకులు ఆదివారం జాతీయ మెటల్ ఫెడరేషన్ సమావేశాలకు వెళ్లారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో జంషెడ్‌పూర్‌లో జాతీయ మెటల్, మెటల్ మైనస్, ఇంజినీరింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సమావేశాలు జరగనున్నాయి. స్టీల్ ఇంటక్ నాయకులు మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు నేతృత్వంలో మద్ది అప్పలరాజు, పి.వి. నగేష్, ఎస్. వెంకన్న, జెర్రిపోతుల మోహన్‌కుమార్, బంటురాములు వెళ్లారు.

మొదలు తొలగించరా?



ప్లాట్‌ఫారం మధ్యలో తొలగించకుండా వదిలేసిన మొదలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై అభివృద్ధి పనులకు అడ్డంగా ఉందని భారీ వృక్షాన్ని రెండు మాసాల కిందట తొలగించారు. అయితే మొదలును వేళ్లతో పాటు పెకిలించకుండా వదిలేయడంతో రాత్రి సమయంలో ప్రయాణికులు దాన్ని గుర్తించలేక రైలును అందుకోవాలని పరుగులు తీస్తూ మొదలును తన్నుకుని పడిపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే వాటిని తొలగించే ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఈవోఐలను రద్దు చేయాలి

నిర్వాసిత కాలనీల్లో ఉక్కు సంకల్పర్యాలీ



నడుపూరు గాంధీ పార్కు వద్ద మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్



86వ వార్డులోని నిర్వాసితకాలనీల్లో కార్మికుల ప్రదర్శన



ఉక్కునగరంలో ప్రసంగిస్తున్న కార్మిక నాయకులు

ఉక్కునగరం/పెదగంట్యాడ/కూర్మన్నపాలెం: శాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, 32 డిపార్టుమెంట్లకు సంబంధించిన ఈవోఐ టెండర్లను రద్దు చేయాలని ఉక్కు అఖిల పక్ష సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని.. ఈవోఐలను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఆదివారం ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వ్యతిరేకంగా నిర్వాసిత కాలనీలతో పాటు ఉక్కునగరంలో ఆదివారం ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీ అన్ని సెక్టార్ల మీదుగా సెక్టార్–3 కాంప్లెక్స్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏతో కూడిన పెండింగ్ జీతాలు చెల్లించాలని, టౌన్‌షిప్‌లో కరెంట్ ఛార్జీలు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, రామస్వామి, ఎస్.రామారావు, రామకృష్ణ, పిట్టా రెడ్డి, గణపతి, పీవీ రమణమూర్తి, మసేన్‌రావు, తాతారావు , పి.వేణుబాబు. కె.భాస్కరరావు సన్యాసిరావు, దానయ్య, రాజశేఖర్. చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి

సబ్బవరం: ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశం కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రం సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ఆదివారం ఆటో కార్మికుల నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయడం వల్ల రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బ తిందన్నారు. ఆటో కార్మికులకు వాహన మిత్ర ద్వారా సంవత్సరానికి రూ.25 వేలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకురాలు ఉప్పాడ సత్యవతి, ఎం. గౌరేష్, కె. కోటి, జి. ప్రసాద్, నాయుకులు బంగారి నాయుడు, రమణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల సేవలో ‘చిన్ముద్ర ట్రస్ట్’

సీతంపేట: అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నాలుగు రాష్ట్రాల ట్రస్ట్ సభ్యుల సమావేశం ఆదివారం శంకరమఠంలో జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. రాష్ట్రాలు, జిల్లాల వారీగా ట్రస్ట్ సభ్యుల సమక్షంలో కమిటీల ఏర్పాటు దిశగా ముందుకెళ్లాలని, ట్రస్టు ద్వారా చేపట్టాల్సిన సేవా కార్యక్రమాల గురించి చర్చించారు. కొన్ని సంస్థలు తెలుగు అయ్యప్ప స్వాములకు చేస్తున్న అన్యాయాన్ని అడ్డుకోవాలని తీర్మానించారు. తెలుగు రాష్ట్రాల నుంచి 60 శాతం భక్తులు, అయ్యప్ప స్వాములు శబరిమలకు వెళ్తున్నా.. తెలుగు వారికి సరైన ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. ఇకపై ఇలాంటి పరిణామాలు ఎదురుకాకుండా ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు, కేరళ ప్రభుత్వంతో, రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల సహకారంతో అయ్యప్పల రక్షణ, సేవకు అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు ముందుంటుందని తెలిపారు. ట్రస్టు సభ్యులు పి.ఆదిమోహన్‌రెడ్డి, రుద్ర కోటేశ్వరరావు, సిరిసేటి రాజేష్‌గౌడ్, బి.ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గాజువాక

9912222749, 9705347420, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com